

జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి

[ప్రవేశం, కీచకుడు, షుమారు ముప్ఫై ఏళ్లుంటాయి, ప్రెంఛికట్ మీసం బెంగాలీ క్రాపు.]

నా పేరు సింహబలుడు. నేను విరాటరాజుగారి పెద్ద బావమరిదిని. నేను మెత్తగా ఉన్నంతసేపు లక్కల్లే ఉంటాగానీ—బిగిశానంటేనా—హేఁ—యమ నిక్కు నిక్కుతా! ఏమిటో అల్లా టప్పాకింద కట్టేస్తున్నట్లుంది లోకం...ఉల్లిపాయల పులుసు అంటే నాకు—ఎంత ఇష్టమో...?

[ద్రౌపది యింతట్లో ప్రవేశించి ఆరు నెలలనాడు పోయిన ఉత్తర పాత చెడావుల్ని వెతుకుతూ అక్కడే తచ్చాడు తూంటుంది—వయస్సు ఇరవై ఆరు—కష్టాలనుభవించిన మొహం.]

సింహబలుడు:—(తనలో) ఈ అమ్మాయినే కదూ—కాముకి—అని అన్నాడు మా ఊరి అబ్బాయి. (పైకి) తమరేనా మాఅక్క అంతఃపురంలో యిటీవల ఉన్నది.

ద్రౌపది:—అవును.

సింహ:—నా పేరు సింహబలుడు. నేను విరాట రాజుగారి పెద్ద బావను.

ద్రౌపది:—చిత్తం. తమరు పండితులని విన్నాను.

సింహ:—నాకు పెద్దబాలశిక్ష బాఘా వొచ్చును.

ద్రౌపది:—చిత్తం.

సింహ:—(తనలో) ఈ అమ్మాయి బాగా ఉల్లిపాయలు తింటుందల్లే ఉంది. అమ్మో ఎంత "శృంగారరస పట్ట భద్ర"యో? (పైకి) మీ పేరు?

ద్రౌపది:—సైరంధ్రి అంటారు।

సింహ:—మీరు ప్రబంధయుగం లోంచియిలా చక్కా వొచ్చారా? (తనలో-భలే బావుంది).

ద్రౌపది:—ఓ నాటకంకూడా దాటి వొచ్చాను.

సింహ:—(తనలో) పాపం-ప్రబంధం అంటే ఎరగదల్లే ఉంది (పైకి) ప్రబంధం అంటే ఎరగరా మీరు? కవిచౌడప్ప శతకంలేదూ...అట్టివి ప్రబంధాలంటే—మీకు సంగీతం బాగా వొచ్చనుకుంటా?

ద్రౌపది:—(తనలో) ఛీ—వీడొక భ్రష్టుడు.

సింహ:—ఇప్పుడు పాడమంటానని ఆలోచిస్తున్నారు? అబ్బే ఎల్లుండి మా యింట్లో కచ్చేరి పెట్టిద్దామని.

ద్రౌపది:—(తనలో) వీణ్ణి ఎల్లాగన్నా మన్ను చెయ్యాలి.



సింహ:—మిమ్మల్నే నా యిటీవల..."అయిదు గురు భర్తలట! ఎంతకాముకి" అన్నారట ఎవరో?

ద్రౌపది:—(మౌనం).


సింహ:—సరేలెండి. మా అక్కగారు యింట్లో ఉన్నారా?

ద్రౌపది:—ఉన్నారనుకుంటా.

(ఇద్దరు వెళ్ళిపోతారు.)

(రెండో రంగం.)

(సుదేష్ణ టీ త్రాగుతూంటుంది. సాయంత్రం నాలుగు గంటల ప్రాంతాలు. ఉత్తర అప్పుడేవొచ్చి టీకు



కబురుచేసి సిగరెట్టు ముట్టిస్తుంది. సింహబలుఁడు కొంచెం అవతల గడ్డం చేసుకుంటూ ఉంటాడు. ద్రౌపది ఉత్తర కూ్క-డా టీ తెచ్చి టీ పాయిమీద పెట్టి వెళ్లిపోతుంది.

సింహ:—అక్క-య్యా ఈ అమ్మాయి ఎవరూ?

సుదేష్ణ:—ఎవరో నాకూ తెలియదు. ఓ ఏడాది మాయింట్లో ఉంటానంటే ఉండమన్నాను.

ఉత్తర:—సంగీతం బాగా వొచ్చునుకుంటా మామయ్యా మా బృహన్నలగారు చెప్పారు.

సింహ:—ఉహుఁ—ఆ పేడిమూతి వాడికి ఎల్లా తెలుసూ?

సుదేష్ణ:—అల్లా అనకూడదు పరాయివాళ్లని,

సింహ:—అక్క-య్యా. ఆ అమ్మాయిని చూస్తే—రకంవారీగానే ఉన్నది!

సుదేష్ణ:—అప్పుడే నీ కన్నుబడ్డదే—యిక బాగుపడవు.

సింహ:—అది కాదు అక్క-య్యా—మొన్న మన వూళ్లో ఎవరో అన్నారు. “అయిదుగురు భర్తలట—ఎంత కాముకి” అని.

సుదేష్ణ:—అంతా ఉత్తది.

సింహ:—అవును గాని—చెబితే నమ్మతావో నమ్మవో అక్క-య్యా. ఆ అమ్మాయికోసం నా ఎదురురొమ్ము కొట్టుకుంటోంది,

సుదేష్ణ:—ఛీ తప్పు—అల్లా అనకూడదు.

సింహ:—అల్లాకాదక్క-య్యా—ఆవిడ కళ్లుచూశావూ?—ఏమోకాని అక్క-య్యా—నాకు మటుక్కు- ఆవిడంటే సుగంధంతో కూడుకొన్నటీవలె ఉంటుంది.

సుదేష్ణ:—యిటువంటి మాటలు చెప్పకు.

ఉత్తర:—మామయ్య రసోన్మత్తుడు.

సింహ:—అక్కా- చనువు కనుక నీతో చెప్తున్నాను ఆ అమ్మాయిని యీ రాత్రి మా యింటికి పంపకపోతే యీ కత్తి పెట్టుకు పీక కోసుకుంటాను—నిజం!

సుదేష్ణ:—అఘూ యిత్యం మాటలు చెప్పకు.

సింహ:—నిజమక్క-య్యా. నిజం ముమ్మాటికీ నిజం!

సుదేష్ణ:—నీకు సుదేష్ణవంటిది. తప్పు! అల్లా అనకూడదు.

సింహ:—అక్కా- నీకేమన్నా పిచ్చా. వెర్రి పోలికలు చెప్తావేమిటీ. నా మాటకు ఒప్పుకోకపోతే—యిప్పుడు నీ రెండుకళ్ల ఎదటా యిప్పుడే కోసుకుంటాను—ఇదుగో!

సుదేష్ణ:—ఏమిట్రా గందరగోళం!

ఉత్తర:—మామయ్యా! సిగరెట్టు కావాలా?

[సింహ. గడ్డం చేసుకోవడం పూర్తి అవుతుంది. ముఖం కడుక్కు వొస్తాడు. ఉత్తర సిగిరెట్టు యిస్తుంది. సింహబలుడు అంటిస్తాడు.]

సింహ:—అక్కా నా వొళ్లు పట్టుకుచూడు...ఎల్లా ఉందో—శీత పైత్య జ్వరంలాగు!

సుదేష్ణ:—అప్రదిష్ట...అప్రదిష్ట.

సింహ:...ఉత్తరా టీ తీసుకు రమ్మను.

(ఉత్తర వెళ్ళిపోబోతుంటే—కీచకుడు ఆమెకు కన్ను కొడతాడు. ఆమె మొహం చిట్లించుకు వెళ్లిపోతుంది.)

సింహ:—(టీ తాగుతూ) అక్కయ్యా—రాత్రి పది దాటిం తరువాత టీ కాచమను. టీ డస్టు తీసిదాచెయ్యి. ఆ వెనక టీ డస్టుకోసం సైరంధ్రిని మా యింటికి పంపు...లేకపోతే నేను బ్రతుకను.

సుదేష్ణ:—జలగలా పట్టుకున్నావేమిరా? అల్లాగేలే వెళ్లు.

సింహ:—అల్లాగేలే అంటేకాదు. ఎదురు చూస్తూ ఉంటాను.

సుదేష్ణ:—సరేలే!

సింహ:—అక్కయ్య అన్నమాట తప్పను.

సుదేష్ణ:—నాక ప్రదిష్ట తీసుకురాకు.

సింహ:—చెప్పిపెట్టిన బుద్ధి ఎంతసేపూ?

(అంతా వెళ్లిపోతో)

వర్షం కురుస్తుంది. ఆవర్షం. అల్లా—యిల్లా—భేష్గ్గా—సొగసుగా—అందంగా—ఉన్నది.

మూడో రంగం. రాత్రి పదిగంటల తరువాత.

[ద్రౌపది చెళ్లలేక గజగమనంతో వెళుతూంటుంది. కీచకుడు ఏమీ తోచక అటూ యిటూ వరండాలో పచారు చేస్తుంటాడు. వాకిట్లో పారావాళ్లు ఉండరు. దూరంనుంచీ ద్రౌపదినిచూచి యింట్లోకి పోయి పెద్ద బాలశిక్షా—కవిచౌడప్ప శతకం తీసుకుని చదువు తూంటాడు.]

ద్రౌపది:—(ప్రవేశించి) సింహబల మహారాజా!

సింహ:—"..............."

ద్రౌపది:—కీచక మహారాజా!

సింహ:—ఎవరు వారు?

ద్రౌపది:—నేనండీ సైరంధ్రిని. సుదేష్ణ పంపితే వొచ్చాను.

సింహ:—ఓహో—మీరా? దయచేయండి. లోపల చదువుకొంటున్నాను.

ద్రౌపది:—తమ రిప్పుడు పఠించే గ్రంథం ఏమిటండీ?

సింహ:—పెద్దబాలశిక్ష.

ద్రౌపది:—అల్లాగాండి.

సింహ:—మా అక్క మిమ్మల్ని పంపిందా?

ద్రౌపది:—అవును. టీ డస్టుకోసం.

సింహ:—"రావే నీ కవుగింట నన్ను మమతే—"

ద్రౌపది:—తమరు టీ సేవించారా?

సింహ:—నీకు కావలెనా? ఓ లక్షకప్పులు యిప్పిస్తాను.

ద్రౌపది:—నా కక్షిణ్లేను తమరు కులాసాగా పొందు కొంటూంటే—తాగేరెమో అనుకొన్నాను.

సింహ:—పోనీ—నువ్వుకూడా తాగరాదూ?

ద్రౌపది:—అక్కర్లేదండి.

సింహ:—అబ్బే—మీరుకూడా తాగి నన్ను ధన్యుణ్ణి చేయరాదూ? ఇదుగో ప్రేమదాసుడు.

ద్రౌపది:—టీ డస్టు యిప్పించండి—మీ అక్కగారు టీకోసం బాధపడుతూంటారు.

సింహ.—(వెకిలి నవ్వునవ్వి) మరేమీ అక్కకు బాధ ఉండదు లెండి.

ద్రౌపది:—కాదు తలకాయ నొప్పిగా ఉందామెకు.

సింహ:—అదంతా ఉట్టిది—నాకోసమే మిమల్ని పంపారు.

(అని ముందుకొస్తాడు.)

ద్రౌపది:—(వైతొలగి) మర్యారోద్యమబాహు విక్రమ రసాస్తోక-

సింహ:—ఆగూ – నాకూవొచ్చు ఆపద్యం – ఘర వాలా! "నీచను గొండలగ్రుమ్మి—."

ద్రౌపది:—(ఇరిటేటై) నలిపివేయాలా?

సింహ:—ఆఁ అది.

ద్రౌపది:—ఇంతకీ—టీ డస్టు యిస్తారా? యియ్యరా?

సింహ:—నీ కాలిమీద పడతా—కౌగలి యియ్యవూ?

ద్రౌపది:—హల్లాగా? /

సింహ:—మరి నా వొళ్లు పనసకాయల్లే గరిపొడ వొద్దూ? (దగ్గరికొస్తాడు.)

ద్రౌపది:—రట్—ఆగు!

సింహ:—(అదిరిపడి) క్రాపు ఎగరేస్తాడు.

ద్రౌపది:—నేను వెళ్ళి పోవొచ్చా?

సింహ:—అప్పుడే?

ద్రౌపది:—మరి నేను వచ్చినపని అయిందిగా?

సింహ:—నాకు ప్రేమ భిక్ష పెట్టవూ?

ద్రౌపది:—నాకోసం నువ్వు ఏంత్యాగం చేస్తావ్?

సింహ:—నా ప్రాణాలు అయిదూ అర్పిస్తా.

ద్రౌపది:—(పక్కని ఉన్న ఇనపగుదియ అతనికి తెలియకుండా పట్టుకుని.) అయితే ఇల్లారా!

సింహ:—(వొస్తాడు.)

ద్రౌపది:—అల్లాపో

సింహ:—(పోతాడు).

ద్రౌపది:—యిల్లావొచ్చి అటుమొహం పెట్టికూర్చో.

సింహ:—(అల్లాగే కూర్చుంటాడు.)




ద్రౌపది:—(వెనుకపాటున తపీమని గుదియ పెట్టిహాడి నెత్తిన కొడుతుంది. సింహబలుడి వొళ్లంతా నెత్తురు మయం.)

(ఇవతలకు వొచ్చి) ఇవాళతో అజ్ఞాతవాసం సంపూర్తి ఇకముందుచూసే రక్త ప్రవాహానికి యిది మొదటి అనుభవం. త్రాష్టుడు! వెళ్లి యీ వార్త భీముడితో చెప్తా.

[తెర.]

నమూనా ఉచితము




ఇండోబామ్

ఇతర అంజనములు, బాములవలె మండదు. ఒకతూరి వాడినవారు మరల మరల వాడుచు స్నేహితులకు సిఫారసు జేయుచున్నారు. తలనొప్పులు, పార్శ్వపు నొప్పులు, వాయువుపోట్లు, వెన్నుపోటు, బెణుకులు, పంటినొప్పి, జలుబు, దగ్గు మొదలగు బాధలను పోగొట్టును. అమూల్యమగు ఓషధులచే తయారుకాబడినది. బాధగల స్థలమున మందుతో తోమిన చర్మమునందు ప్రవేశించి బాధను పోగొట్టును. అన్నివిధములగు నొప్పులకు బాధలకు సిద్ధౌషధము. ప్రతిచోటను ఏజెంట్లు కావలయును.

చక్కని డబ్బి సహా బుడ్డి 1-కి రు. 0-8-0. బుడ్లు 3-కి రు. 1-4-0.

పోస్టు ఖర్చులు వేరు.

కార్నిక్ బ్రదర్స్, గిర్గాం, బొంబాయి. 4.